జై జగన్నాథ



భక్తులతో కళకళలాడుతున్న టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం

- కనులపండువగా **రథోత్సవం**
- పాతనగరం ఎం**బర్‌మన్నార్ ఆలయం** నుంచి ఓ రథం
- టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం నుంచి మరో రథం
- బౌడారా రోడ్డు ఒడియా బ్రాహ్మిణ్ నుంచి ఇంకో రథం
- ఇస్కాన్ నగర శాఖ 4 రథాలు
- 'దక్షిణం'లో ఆధ్యాత్మిక పరిమళం

దాబాగార్డెన్స్: జై జగన్నాథ.. జయహో జగన్నాథ అంటూ భక్తుల నామస్మరణతో దక్షిణ నియోజకవర్గం మార్మోగింది.టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి ఆలయం నుంచి ఓ రథం టర్నర్‌చౌల్ట్రీకి బయల్దేరగా, పాతనగరం కంచరవీధి ఎంబర్‌మన్నార్ దేవాలయం నుంచి మరో రథం బయల్దేరాయి. టర్నర్ చౌల్ట్రీ వరకు రథయాత్ర సాగింది. బౌడరా రోడ్డులో ఒడియా బ్రాహ్మిన్స్ ఆధ్వర్యంలో అల్లిపురం ఏడుగుళ్లు, బౌడారారోడ్డు, స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల గుండా స్వామి రథయాత్ర సాగింది. జిల్లా పరిషత్ సమీపాన గల శ్రీకృష్ణుని ఆలయం నుంచి రథయాత్ర సాగింది. సంకీర్తనలు..కోలాటాలు, భజనలు..విష్ణు సహస్రనామ పారాయణ, వేదమంత్రాలు..మంగళధ్వనితో నియోజకవర్గం శోభాయమానంగా మారింది.గల్లీలు..రహదారులు వాహనాలతో నిండిపోయాయి. ఉచిత ప్రసాదాలు..మజ్జిగ పంపిణీలకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి.

185 ఏళ్ల ఘన చరిత్ర గల అతిపురాతన టౌన్‌కొత్త రోడ్డు జగన్నాథస్వామి ఆలయంలో జగన్నాథుని రథయాత్ర శుక్రవారం సాయంత్రం వైభవంగా సాగింది. జిల్లా పరిషత్ శ్రీకృష్ణ మందిర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్ర కనులపండువగా సాగింది. జిల్లా పరిషత్ శ్రీకృష్ణ చైతన్య మఠం నుంచి ప్రారంభమైన రథయాత్ర సెంచరీక్లబ్, ఆర్కే బీచ్, బీచ్‌రోడ్డు, కోస్టల్ బ్యాటరీ, కలెక్టరేట్ మీదుగా జిల్లా పరిషత్ జంక్షన్ వరకు సాగింది. సాయంత్రం 4 గంటలకు ఇస్కాన్ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 4 రథాల రథయాత్ర వేడుకగా సాగింది.

రథయాత్ర సాగిందిలా..

టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైంది. అక్కడి నుంచి వేదమంత్రాలు, గీతా పారాయణ, మేళతాళాలు, కోలాటం నడుమ వైభోవపేతంగా రథయాత్ర సాగింది. టౌన్‌కొత్తరోడ్డు నుంచి ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు, పూర్ణామార్కెట్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా టర్నర్ చౌల్ట్రీ వరకు యాత్ర సాగింది.



జగన్నాథుడి రథోత్సవంలో సందడి



టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథ రథోత్సవంలో చిన్నారుల కోలాటం



పూజల్లో పాల్గొన్న కందుల నాగరాజు, ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు



రథంపై కొలువైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు

కంచరవీధి నుంచి..: పాతనగరం కంచరవీధిలో గల ఎంబర్‌మన్నార్ దేవాలయం నుంచి బయల్దేరిన రథం బురుజుపేట, సీతారామస్వామి ఆలయం, కనకమహాలక్ష్మి ఆలయం, రీడింగ్‌రూమ్ మీదుగా టౌన్ కొత్తరోడ్డు వరకు సాగింది. అనంతరం టౌన్‌కొత్త రోడ్డు నుంచి ప్రారంభమైన రథయాత్రకు కలిపారు.

బౌడారారోడ్డులో.. : స్టేషన్‌రోడ్డు బౌడరారోడ్డులో ఒడియా బ్రాహ్మిన్స్ ఏర్పాటు చేసిన రథం అల్లిపురం ఏడుగుళ్లు, నేరేళ్లకోనేరు, స్టేషన్‌రోడ్డు, బీఎన్ఆర్ జంక్షన్ తదితర ప్రాంతాల మీదుగా సాగింది.

ఉత్కళ్ సమాజ్ ఆధ్వర్యంలో..

అల్లిపురం: నేరెళ్ల కోనేరు, ఉత్కళ్ సమాజ్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహించారు. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడి విగ్రహాలను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి, ఒడియా సంప్రదాయంలో పూజలు చేశారు. 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్‌లతో రథంపై పూజలు నిర్వహించారు. జగన్నాథ స్వామికి సపర్యల అనంతరం బంగారు చీపురుతో రథాన్ని శుభ్రపరిచారు. ఒడియా సంప్రదాయ రీతిలో వాయిద్యాలతో పాటలు పాడుతూ భక్తులు రథాన్ని లాగారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. రథయాత్ర నేరెళ్ళ కోనేరు కాలనీ నుంచి గోకుల్ థియేటర్ మీదుగా చలువతోట, సింహాలదేవిడి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్ రోడ్డు మీదుగా తిరిగి నేరేళ్ల కోనేరు ఉత్కళ్ సమాజ్ వరకు సాగింది. కార్యక్రమంలో ఉత్కళ్ సమాజ్ ప్రతినిధులు ప్రవీణ్ మహంతి, రమేష్ పాడి, సుదర్శన్ పాడి, సమాజం సభ్యులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి చెంగల్రావుపేట సీతారామచంద్ర స్వామి ఆలయం నుంచి బయల్దేరిన జగన్నాథుని రథం



పాతనగరం ఎంబర్‌మన్నార్ దేవాలయం నుంచి ప్రారంభమైన రథం



రథంపై కొలువుదీరిన జగన్నాథుడిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు



ఇస్కాన్ నగర శాఖ రథయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు

క్లుప్తంగా

వివేకానంద సంస్థకు వితరణ



సంస్థకు గ్యాస్ స్టవ్, వాటర్ డిస్పెన్సర్ అందజేస్తున్న జీవీఆర్ కుమార్

దాబాగార్డెన్స్: పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థకు దాతలు వాటర్ డిస్పెన్సర్, గ్యాస్ట్ స్టవ్‌ను బహూకరించారు. సంఘ సేవకుడు పలుకూరి సుబ్బరాజు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె, అల్లుడి తరపున జీవీఆర్ కుమార్ వీటిని శుక్రవారం సంస్థకు అందజేశారు. దాతలు గతంలో ఆశ్రమానికి కుర్చీలు, భోజనం ప్లేట్లు అందజేశారని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు.

మహిళ వైద్య ఖర్చులకు చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: అనారోగ్య సమస్యతో బాధ పడుతున్న మహిళ వైద్య ఖర్చుల కోసం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. లక్ష్మీటాకీస్ గానుగులవారి వీధికి చెందిన రాచమల్లి లక్ష్మి బ్రెయిన్‌కు సంబంధించిన సమస్యతో బాధ పడుతున్నారు. ఆమెకు ఆశీల్‌మెట్టలోని వాసుపల్లి కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తన సొంత నిధుల నుంచి ఆ మొత్తాన్ని అందించారు. వైద్యానికి సంబంధించి ఏ సహాయం చేయడానికైనా తాను ముందుంటానని వాసుపల్లి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, పలు వార్డుల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తులసి పూజ

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

పరిశీలన గృహం సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



పరిశీలన గృహంలో సిబ్బందితో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: విశాఖలో అబ్జర్వేషన్ హోమ్, స్పెషల్ హోమ్, బాలికల గృహాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు శుక్రవారం సందర్శించారు. అక్కడ హోమ్‌లలో పరిస్థితులను, సౌకర్యాలను పరిశీలించారు. అక్కడి పిల్లలతో మాట్లాడి వారి బాగోగులు, విద్య, ఆరోగ్య, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. హోమ్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, వైద్య సేవల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

పిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధులను గుర్తించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: పిల్లల్లో పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలను తొందరగా గుర్తించి, సరైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లా స్థాయి వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలకు రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు పుట్టుకతో వచ్చే సమస్యలను గుర్తించి, వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతీ చిన్నారికి సమగ్ర ఆరోగ్య పరీక్షలను తగిన మార్గదర్శకాలు పాటిస్తూ అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.హారిక, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ వి.సంధ్యారాణి, ఇ.శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర సంచులనే వినియోగించాలి



డ్రై డే కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జగన్నాథ రథయాత్రకు వచ్చే భక్తులు పూజా సామాగ్రిని వస్త్ర సంచుల్లోనే తీసుకువెళ్లాలని జెడ్సీ మల్లయ్యనాయుడు సూచించారు. వన్‌టౌన్‌లో జగన్నాథ రథయాత్ర ఏర్పాట్లను శుక్రవారం ఉదయం ఆయన పరిశీలించి, మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధంలో జీవీఎంసీకి సహకరించాలని కోరారు. నిషేధిక ప్లాస్టిక్‌ను వదిలి, ఇళ్ల నుంచి జ్యూట్ బ్యాగ్‌లు, వస్త్ర సంచులతో ఆలయాలకు రావాలన్నారు. వ్యాపారులు కూడా వివినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లలో సరకులు ఇవ్వకూడదని తెలిపారు.

డ్రై డే పై అవగాహన

వన్‌టౌన్ నుంచి జగదాంబ వరకు రహదారులు, కల్వర్టులను పరిశీలించి, చెత్తకుప్పలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఇన్‌స్పెక్టర్లను అదేశించారు. నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం డ్రై డే కార్యక్రమంలో పాల్గొని దోమల ఉత్పత్తిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



వాసుపల్లిని సత్కరిస్తున్న ప్రసాద్

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని వైఎస్సార్ సీపీ 42వ వార్డు నూతన అధ్యక్షుడిగా నియమితులైన భీశెట్టి ప్రసాద్ తెలిపారు. వార్డు అధ్యక్షుడిగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆశీల్‌మెట్టలోని కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి, గజమాలతో సత్కరించారు. వాసుపల్లి అందించిన సహకారంతో పార్టీ అధిష్టానం ఇచ్చిన ఈ పదవిని సద్వినియోగం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయడమే గాక ప్రజల పక్షాన పోరాడుతానని చెప్పారు. వాసుపల్లి మాట్లాడుతూ ప్రసాద్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పలు వార్డుల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నిర్మూలన



దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్



దోమ లార్వా పెరుగుతున్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

సీతంపేట: వారంలో ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ జి.లక్ష్మణ్ అన్నారు. 43వ వార్డు నరేంద్రనగర్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. మలేరియా సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. కుండీలు, డ్రమ్ముల్లో లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించి నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ వారం రోజులకు పైగా మంచి నీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని, వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకుల్లో నీటిని తొలగించి ఆరబెట్టి మళ్లీ నీరు పట్టుకోవాలని సూచించారు. వర్షా కాలం ప్రారంభమైనందున ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు, జీవీఎంసీ సిబ్బంది పద్మావతి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు మంత్రి అభినందన



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను సన్మానిస్తున్న మంత్రి పార్థసారథి

మహారాణిపేట: యోగాంధ్ర వేడుకలను విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి.. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించారు. జిల్లా యంత్రాంగం కార్యక్రమాన్ని ప్రణాళికాయుతంగా నిర్వహించిందని కొనియాడారు.

జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి



డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న విజయలక్ష్మి

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై ఆమె వచ్చారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తిని మర్యాదపూర్వకంగా విజయలక్ష్మి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

యోగాంధ్రలో ఆర్టీసీ సేవలకు ప్రశంసలు



ఆర్టీసీ సిబ్బందికి యోగా టీ షర్టులు అందిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

మద్దిలపాలెం: విశాఖ బీచ్ రోడ్డు వేదికగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజా రవాణ శాఖ నుంచి అందించిన ఉత్తమ సేవలను ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారని ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మద్దిలపాలెం ఆర్టీసీ బస్ డిపో వద్ద గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. యోగాంధ్ర విధుల్లో పాల్గొన్న అందరినీ ఆయన అభినందించారు. వారికి యోగా టీ షర్ట్‌లు అందజేశారు. ప్రతి ఒక్కరూ విధిగా యోగా చేయాలని సూచించారు. యోగా ద్వారా ఒత్తిడి ఉపసమనంతోపాటు ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో భాగస్వాములు కావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేసి ప్రయాణికులకు దగ్గరవ్వాలని, సిబ్బంది ప్రవర్తన మరింత మెరుగుపరచుకొని సమయపాలన పాటించాలని సూచించారు. జూలైలో జరగబోయే సింహాచలం గిరి ప్రదక్షిణకు ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిపో మేనేజర్ కె..గంగాధర్, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీ రామకృష్ణ, స్టోర్స్ ఇంజినీర్ అప్పారావు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు మానసిక రోగులకు షెల్టర్‌లో ఆశ్రయం



వసతిగృహంలో ఆశ్రయం పొందిన వారితో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

అల్లిపురం: మానసిక ఆస్పత్రిలో చికిత్స అనంతరం కోలుకున్న ఏడుగురికి ఏయుటీడీ జీవీఎంసీ టీఎస్ ఆర్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించినట్లు ఏయుటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. గతంలో వీరందరినీ రైల్వే స్టేషన్లో ఆర్‌పీఎఫ్ పోలీసులతో కలసి కాపాడినట్లు చెప్పారు. వివరాలివి.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మమ్ము, గుజరాత్‌కు చెందిన గీత, జగదల్పూర్‌కు చెందిన శ్రీకుమారిలకు మానసిక స్థితి బాగాలేక చినవాల్తేరు మానసిక వైద్యశాలలో చేర్పించి వైద్యం అందించారు. వారు కోలుకున్నప్పటికీ, ఈ ముగ్గురినీ తీసుకువెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో ఏయూటీడీ సిబ్బంది డిశ్చార్జి తీసుకుని షెల్టర్‌కి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. అలాగే మధ్యప్రదేశ్, ఇండోర్‌కు చెందిన హేమలతను రైల్వేస్టేషన్లో రక్షించారు. అదేవిధంగా ఒడిశా, పూల్వనికి చెందిన సమీర్ కుమార్, రాయపూర్, టాటానగర్‌కు చెందిన అర్జున్ నిశద్ , మహారాష్ట్ర, పూణేకు చెందిన బికాస్‌లను ఏయూటీడీ ద్వారా రైల్వే స్టేషన్లో కాపాడారు. ఈ ఏడుగురు పూర్తిగా కోలుకున్నారు. దీంతో వీరిని సొంత ఊళ్లలో కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని కోరుతూ ముంబయి నుంచి వచ్చిన శ్రద్ధా సోషల్ వర్కర్స్‌కు శుక్రవారం వివరాలు అందించారు.

అంధ బాలలకు సరకుల వితరణ



హోమ్‌కు సరకులు అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు శ్రీధర్

కంచరపాలెం: లక్ష్మీపురంలోని హెల్ప్ అండ్ హెల్ప్ అంధుల విద్యాసంస్థకు జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరకులు అందజేశారు. కార్పొరేటర్ పూర్ణిమ మాట్లాడుతూ సేవలో మానసిక ప్రశాంతత, సంతృప్తి ఉన్నాయన్నారు. మానవసేవే మాధవ సేవగా చేస్తున్న భావించి, సేవలు అందిస్తున్న హోమ్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం హోమ్‌లో అంధులకు, అభాగ్యులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేళంగిణిరావు, సుధాకర్ హోమ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా యూజీడీ గొయ్యి



బురదగా మారిన వివేకానంద కాలనీ

అల్లిపురం: వివేకానంద కాలనీలో ఇటీవల చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనుల కారణంగా స్థానికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనుల అనంతరం గోతులను సరిగా పూడ్చకపోవడంతో, గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు ఆ ప్రాంతం బురదమయంగా మారి వాహనాలు కూరుకుపోతున్నాయి. స్కూలుకు వెళ్లే విద్యార్థులు కూడా ఈ బురద కారణంగా ఇబ్బందులు పడుతున్నారని వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము తెలిపారు. ఈ సమస్యపై జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి, బురదగా మారిన గోతులను పూడ్చాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు కళాభారతిలో నాట్య పురస్కారాల ప్రదానం

మద్దిలపాలెం: సాయిసురేఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నృత్యకారులకు నాట్య పురస్కారాలు ప్రదానం చేయనున్నామని నిర్వాహకులు రేఖ అట్టాడి, సాయి, సురేఖ అట్టాడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంప్రదాయ నాట్యం మొదలు పెట్టి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన నృత్యకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నాట్య ప్రదర్శనలు ప్రారంభమవుతాయని, అందరూ ఆహ్వానితులేనని చెప్పారు.